క్లుప్తంగా

వైభవంగా శ్రీరామదాసు తాత రథోత్సవం



రథోత్సవం తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు

గూడూరు రూరల్: మండల పరిధిలోని మునగాలలో రామదాసు తాత రథోత్సవం గురువారం వైభవంగా జరిగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి సైతం భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి దేవాలయంలో రామదాసు తాతకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వరకు మేలతాళాలు మధ్య రథాన్ని భక్తులు లాగారు. గూడూరు ఎస్ఐ హనుమంతయ్యను సర్పంచ్ గోపాల్, రామాంజనేయులు, గ్రామ పెద్దలు సత్కరించారు.

మూలపెద్దమ్మకు ప్రత్యేక పూజలు



మూలపెద్దమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వేచియున్న భక్తులు

గడివేముల: మండల కేంద్రంలోని మూలపెద్దమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలిరావడంతో అమ్మవారి ఆలయం గురువారం భక్తులతో కిక్కిరిసింది. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ తదితర విశేషపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చైర్మన్ తలారి చిన్నన్న, ఈఓ మోహన్‌లు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పరామర్శ

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని దిన్నెదేవరపాడు పంచాయతీ అంబేడ్కర్ నగర్‌కి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రతాప్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ కర్నూలు జనరల్ హాస్పిటల్‌లో మృతి చెందాడు. కోడుమూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ గురువారం ఆ గ్రామానికి వెళ్లి ప్రతాప్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. బాధిత కుటుంబానికి పార్టీ తరుపున అండగా ఉంటామన్నారు.

హాల్ టిక్కెట్లు విడుదల

ఓర్వకల్లు: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష హాల్ టిక్కెట్లు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ జోషులావాట్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 21న అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షకు విద్యార్థులు హాల్ టిక్కెట్లను https//cse.ap.gov.in లేదా https//apms.apcfss.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు.

నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు



అహల్యాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నిల్వ ఉన్న నీరు

పాణ్యం: మండల పరిధిలోని అమల్యాపురం సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌ను అధికారులు ముందస్తు ప్రణాళికల్లో భాగంగా నీటితో నింపారు. వేసవిలో నీటి ఎద్దడి తరుముతున్న నేపథ్యంలో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌లో నీటిని నిల్వ చేసి అక్కడి నుంచి అహల్యాపురం, కొత్తూరు, అనుపూరు, మద్దూరు గ్రామాల ప్రజలకు తాగునీరు అందించనున్నారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ట్యాంక్‌ను 70 శాతం నింపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఏ మధుశేఖర్ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ.. నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఎమ్మిగనూరు మండలం పార్లపల్లి గ్రామానికి చెందిన కురవ ఉరుకుందు, కురవ లక్ష్మి అలియాస్ శంకరమ్మ, గురజాలకు చెందిన బెస్త శీను బైక్‌పై కర్ణాటక మద్యాన్ని తలిరలిస్తుడంగా పట్టుకున్నామన్నారు. కర్ణాటక మద్యం 186 జాన్స్ ఒరిజినల్ చాయిస్ విస్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, బైక్‌ను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కోడుమూరు: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సి.బెళగల్: ఖురాన్ సందేశాన్ని వినిపిస్తున్న హఫీసాబ్ జక్రియా



సి.బెళగల్: ఈద్ ఉల్ ఫితార్ దువా చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్



పాణ్యం : ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కల్లూరు: రంజాన్ పర్వదినాన్ని నియోజకవర్గంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గురువారం ఉదయమే కొత్త దుస్తులు ధరించి మసీదులు, ఈద్గాలకు చేరుకుని ప్రార్థనలు చేశారు. కల్లూరు అర్బన్‌లోని ముజఫర్‌నగర్‌లో హజ్రత్ మౌలానా యూసుఫ్ సాబ్ రహే మస్జిద్‌లో బయాన్ హజ్రత్ మౌలానా జుబెర్ అహ్మద్ ఖాన్, నమాజ్ ముఫ్తీ ఖలీల్ అహ్మద్ అందరూ సుఖంగా ఉండాలని ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు, పూడిచెర్ల, ఓర్వకల్లు, హుసేనాపురం, కాల్వ, తిప్పాయపల్లె, గుట్టపాడు గ్రామాల్లో రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మతగురువులు ఖురాన్ సందేశం వినిపించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం, నగదుతో దానధర్మాలు చేసి, భక్తిభావాలను చాటుకున్నారు.

పాణ్యం: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ముస్లింలు ఎంపీడీఓ కార్యాలయ పక్కన ఉన్న ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు దైవ సందేశాన్ని, రంజాన్ మాసం గొప్పతనాన్ని వివరించారు. కౌలూరు సమీపంలోని హైవే పక్కన ఉన్న ఈద్గాలో ముస్లింలు ప్రాత్యేక ప్రార్థనలు చేశారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో రంజాన్ పండుగ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గడివేములతో పాటు బిలకలగూడూరు, గని, మంచాలకట్ట, బూజునూరు, పెసరవాయి, కరిమద్దెల, కొర్రపోలూరు గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాలు, మసీదులకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించుకున్నారు.

కోడుమూరు రూరల్: మండల కేంద్రం కోడుమూరుతోపాటు గ్రామాల్లో గురువారం రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముసిం సోదరులు ఉదయాన్నే నూతన వస్త్రాలను ధరించి పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డువైపు ఉన్న ఈద్గా వద్ద చేరుకొని ప్రత్యేక నమాజు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలను తెలుపుకున్నారు. హిందువులు కూడా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి మతసామరస్యాన్ని చాటిచెప్పారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గ్రామాల్లో రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సి.బెళగల్‌లో ఢిల్లీ నుంచి వచ్చిన హఫీసాబ్ జక్రియా రంజాన్ ప్రాముఖ్యతను వివరించారు. ముస్లింలు పవిత్ర మాసంలో చేపట్టిన దీక్షలు వారి జీవితాలను అత్యంత ప్రభావితం చేస్తాయన్నారు. ఉపావాసం, సేవాభావాలు, దానం వంటి అంశాలతో అల్లా కృప కలుగుతాయని వివరించారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరినొకరు అలింగనం చేసుకుని సుభాకాంక్షలు చెప్పుకున్నారు.

గూడూరు: పట్టణంలో గురువారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మిగనూరు రహదారి వైపున్న ఈద్గా మైదానంలో ప్రత్యేక దువా నిర్వహించారు. రంజాన్ ప్రాముఖ్యతను ముస్లిం పెద్దలు వివరించారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.



కల్లూరు అర్బన్: ముజఫర్‌నగర్‌లో జరిగిన రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



ఓర్వకల్లు : హుసేనాపురంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం



గడివేముల : మసీదులో రంజాన్ సందేశాన్ని వివరిస్తున్న ఇమాం

14 నుంచి శ్రీరామ కథా రసవాహిని

కర్నూలు కల్చరల్: శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నెహ్రూ నగర్‌లోని సత్యసాయి మందిరంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు శ్రీరామ కథా రస వాహిని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సేవా సమితి జిల్లా అధ్యక్షులు మాకా అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శ్రీరామ కథా రస వాహిని పేరుతో శ్రీమద్ రామాయణంలోని ముఖ్యమైన పాత్రలపై మూడో రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల వరకు ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు. చిన్మయ మిషన్ ప్రవచకులు స్వామిని సుప్రేమానంద సరస్వతి ప్రవచనం చెబుతారని తెలిపారు. 17వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు సీతారాముల కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు.

పెసరవాయిలో వైఎస్సార్‌సీపీ ఇంటింటా ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న శివనరసింహారెడ్డి, తదితరులు

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తన తండ్రి కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గెలిపించాలని ఆయన తనయుడు శివ నరసింహారెడ్డి ప్రజలను కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని, టీడీపీకి ఓటేస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని ఇంటింటికి వెళ్లి వివరించారు. ప్రచారంలో పార్టీ మండల కన్వీనర్ శివరామిరెడ్డి, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, ఎల్లారెడ్డి, రాజారెడ్డి, ఆనందొరెడ్డి, దస్తగిరిరెడ్డి, డాక్టర్ నిరంజన్‌రెడ్డి, పుల్లయ్య, అనిల్ కుమార్ రెడ్డి, మేఘనాధరెడ్డి, బండపల్లి రమేష్, మద్దిలేటి రెడ్డి, దామోదర్ రెడ్డి, కుమార్ రెడ్డి, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి



కోడుమూరులో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



గూడూరులో పూలే చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు ప్రతాప్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు ఈరన్న, ఉసేనప్ప, వెంకటేష్, విజయ్, నాగరాజు, ప్రవీణ్, దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో గురువారం మహాత్మా జ్యోతి రావ్ పూలే 297వ జయంతిని నిర్వహించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, నాయకులు బి.సుభాకర్, ఎస్ఈ భాస్కర్, కౌన్సిలర్లు దస్తగిరి, విజయ్, రవి ప్రతాప్, టక్కు మధు, ప్రవీణ్, టీఎస్ రాజు, ఎస్.దేవదాసు, ట్రాక్స్ గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత విజయవాడ జట్టు



విజయవాడ జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి



బహుమతి అందుకుంటున్న ప్యాపిలి జట్టు సభ్యులు

కోడుమూరు రూరల్ : కోడుమూరులో వెలసిన శ్రీవల్లెలాంబదేవి తిరునాల ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఓపెన్‌టూ ఆల్ కబడ్డీ పోటీల్లో విజయవాడ జట్టు విజేతగా నిలిచింది. మూడురోజుల పాటు జరిగిన పోటీల్లో మొత్తం 28జట్లు తలపడ్డాయి. బుధవారం రాత్రి హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ప్యాపిలి జట్టుపై విజయవాడ జట్టు ఐదు పాయింట్లతో గెలుపొంది విజేతగా నిలిచింది. విజయవాడ జట్టుకు రూ.40వేలు, ప్యాపిలి జట్టుకు రూ.30వేలను దాతల సహకారంతో కమిటీ సభ్యులు అందజేశారు. అదేవిధంగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన గుంటూరు, అయ్యకొండ జట్లకు రూ.20వేలు, రూ.10వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, క్రిష్ణాపురం సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు, మల్లారెడ్డి, రవి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న ఐషర్

పాణ్యం: మండల పరిధిలోని శాంతిరాం ఆసుపత్రి సమీపంలో జాతీయరహదారిపై నీళ్ల ట్యాంకర్‌ను ఐషర్ ఢీకొంది. హైవే సిబ్బంది తెలిపిన వివరాలు.. గురువారం ఉదయం రహదారిపై కర్నూలు వైపు వెళ్తున్న ఐషర్ ముందు వెళ్తున్న నీళ్ల ట్యాంకర్‌ను ఢీకొంది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. హైవే సిబ్బంది అక్కడికి చేరుకుని ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.

మాతృమరణాల తగ్గింపే లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్. వెంకటరమణ

కర్నూలు(హాస్పిటల్): మాతృమరణాల తగ్గింపే తమ లక్ష్యమని సేఫ్ మదర్‌హుడ్ కమిటీ సభ్యులు, కర్నూలు ఫెడరేషన్ ఆఫ్ గైనిక్ సొసైటీ(ఫాగ్సి) అధ్యక్షులు డాక్టర్ ఎస్.వెంకటరమణ చెప్పారు. జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పెద్దాస్పత్రిలోని ప్రసూతి విభాగంలో గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్. వెంకటరమణ మాట్లాడుతూ మాతృమరణాలను తగ్గించేందుకు వైట్ రిబ్బన్ అలయెన్స్ కమిటీ 1991లో ఏర్పాటైందన్నారు. బెటర్ మెటర్నల్ హెల్త్ కేర్ ద్వారా ఏటా సురక్షిత మాతృత్వ దినం నిర్వహించడమే దీని లక్ష్యమన్నారు. గర్భిణులకు యాంటినేటల్ చెకప్స్, అత్యవసర సమయాల్లో అందించాల్సిన వైద్యం, కాన్పు సమయంలో బాలింతలకు, ఆ తర్వాత బిడ్డకు, ఆరు వారాల పాటు బాలింతల కేర్ గురించి వైద్యులతో పాటు సిబ్బంది, గర్భిణీలు, వారి కుటుంబసభ్యులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. గైనిక్ సొసైటీ ద్వారా సేఫ్ మదర్‌హుడ్ కమిటీ చైర్‌పర్సన్‌గా డాక్టర్ పూనమ్ వ్యవహరిస్తున్నారని, సభ్యునిగా తాను ఉన్నట్లు ఆయన తెలిపారు. దీని ద్వారా మాతృత్వ మరణాలు తగ్గించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫాగ్సి ట్రెజరర్ డాక్టర్ మమత, డాక్టర్ వెంకటనారాయణ, డాక్టర్ కు ముద, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ స్నేహ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



ప్రతాప్ కుటుంబ సభ్యులకు డిపాజిట్ బాండ్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కర్నూలు కల్చరల్: ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు యాదవ హాస్టల్ పూర్వ విద్యార్థులు. తెలంగాణ రాష్ట్రం అలంపూర్ మండలం హిమాంపురం గ్రామానికి చెందిన కురువ ప్రతాప్ 15 ఏళ్ల క్రితం జిల్లా కేంద్రంలోని యాదవ విద్యార్థి వసతి గృహంలో ఉంటూ ఎస్టీబీసీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. అనంతరం ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడు ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కర్నూలు యాదవ హాస్టల్ పూర్వ విద్యార్థి వార్డెన్ రామకృష్ణ ఆధ్వర్యంలో రూ.86 వేలు సేకరించి ప్రతాప్ కూతురు సాయివర్షిణి పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. డిపాజిట్ బాండును గురువారం ప్రతాప్ భార్య సాయమ్మ కు అందేజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థు లు లింగందిన్నె నాగరాజు, కొర్విపాడు నారాయ ణ, ఈదన్న, చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రం ప్రారంభం



పూజలు చేసి కంప్యూటర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏకాంబర రెడ్డి

కర్నూలు కల్చరల్: నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని వీహెచ్‌పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని మహాదాత జి.పుల్లారెడ్డి కుమారుడు ఏకాంబర రెడ్డి, మూడు ప్రాంతాల క్షేత్ర సంఘటనా మంత్రి గుమ్మళ్ల సత్యం గురువారం ప్రారంభించా రు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ ఏకాంబర రెడ్డి సౌజన్యంతో వారి మాతృమూర్తి జి.నారాయణమ్మ పేరుతో కంప్యూటర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు, రాష్ట్ర సహ కార్యదర్శి ప్రాణేష్, రాష్ట్ర కోశాధికారి సందడి మహేష్, రాష్ట్ర సహ కోశాధికారి గూడా సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి పెద్దపీట వేశారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 34వ వార్డులో ఆయన ఇంటింటి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పరిపాలన తెచ్చిన ఘనత జగనన్నదేనన్నారు. టీడీపీ పాలనలో పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలకు అంతో ఇంతో సమర్పించుకోవాల్సి వచ్చేదన్నారు. తమ ప్రభుత్వంలో ఎలాంటి లంచాలు లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించామన్నారు. మరోసారి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడు ధర్మ స్వరూపుడు



ప్రవచనం చెబుతున్న ధార్మిక ఉపన్యాసకులు గరుడాద్రి వనజకుమారి

కర్నూలు కల్చరల్: శ్రీరాముడు ధర్మ స్వరూపుడని విశ్రాంత తెలుగు పండితులు గరుడాద్రి వనజ కుమారి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయంలో ఏర్పాటు చేసిన శ్రీమద్రామాయణ ప్రవచన సస్తాహ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు 'శ్రీరాముడు – ధర్మ స్వరూపుడు' అంశంపై ఉపన్యసించారు. ధర్మబద్ధమైన జీవితం ఉత్తమమైందన్నారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నగరూరి దీప్తి, కార్పొరేటర్ నగరూరి శ్రీనివాసులు, అర్చకులు గిరిశర్మ, కృష్ణకాంత్, మహాలక్ష్మి పాల్గొన్నారు.

దేశ రక్షణకు కంకణబద్ధులు కావాలి



ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు కల్చరల్: దేశ రక్షణ, ధర్మం కోసం కంకణ బద్ధులు కావాలని విశ్వహిందూ పరిషత్ క్షేత్ర ఘటన మంత్రి గుమ్మళ్ల సత్యం అన్నారు. గురువారం వీహెచ్‌పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీహెచ్‌పీ అనుబంధ సంస్థల కార్యకర్తలకు వేసవిలో ప్రత్యేక శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. దేశం కోసం పనిచేసేలా దిశానిర్దేశం చేయనున్నట్లు చెప్పారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు, జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ మాట్లాడుతూ రాబోయే హనుమజ్జయంతి, విశ్వహిందూ పరిషత్ షష్టి పూర్తి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. జన సంపర్క అభియాన్ కార్యక్రమంలో భాగంగా నూతనంగా పరిచయమైన హిందూ బంధువులను సామాజిక, ధార్మిక సంస్థల్లోని వివిధ విభాగాల్లో నూతన బాధ్యతలను ఇవ్వాలని సూచించారు. వీర హనుమాన్ విజయ శోభాయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి సందడి మహేష్, కార్యదర్శిభాను ప్రకాష్, నగర అధ్యక్షులు టీసీ మద్దిలేటి, రాష్ట్ర సహ సేవ ప్రముఖ్ గురుమూర్తి, భజరంగ్‌దల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మాతృశక్తి సంయోజక పావని, దుర్గవాణి సంయోజక సింధూర శ్రీవాణి పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు కట్టుదిట్టం

ఎమ్మిగనూరురూరల్: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు కట్టుదిట్టం చేస్తున్నట్లు మంగళగిరి హెడ్‌క్వార్టర్స్ సెబ్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం స్థానిక సెబ్ కార్యాలయంను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులైన పంచలింగాల, సుంకేసుల, బాపురం, పెద్దహరివాణం చెక్‌పోస్టుల దగ్గర నిఘా కట్టుదిట్టం చేస్తామని చెప్పారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఏపీలోకి వచ్చే వాహనాలను చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే పంపాలన్నారు. అక్రమ మద్యం, నగదు, నిషేధిత సామగ్రి తరలింపును కట్టడి చేయాలని సూచించారు. అలాగే ప్రజలు సెబ్ అధికారులకు సహకరించాలని కోరారు. నేర చరిత్ర కలిగిన వారిని ముందుజాగ్రత్తగా బైండోవర్ చేయాలని ఆదేశించారు. కర్నూల్ డీటీఎఫ్ సీఐ నరసానాయుడు, సెబ్ ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

